VISALAANDHRA VIJAYAWADA Phone No 370

4 పేజీలు 6 నయాపైసలు రిజిష్టరు నెం 193

రోజుకు రెండు హత్యలు

హైదరాబాద్, మే 27

1958వ సంవత్సరం ఆఖరి మూడు మాసాల్లోనూ, రోజుకు సగటున రెండు హత్యలు ఆంధ్ర ప్రదేశ్‌లో జరిగాయి

ఆ సంవత్సరంలోనే సెప్టెంబరు 30 నుండి డిసెంబరు నెలాఖరు ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన పెద్ద నేరాలు 8,674 (వి వి)

700 282

విశాలాంధ్ర

సంపుటి 8] విజయవాడ • మే 28 1959 • గురువారం [సంచిక 48

ఒరిస్సాలో భూపరిమితి 15 ఎకరాలు ఉండాలని ప్రజాసోషలిస్టుపార్టీ

కటక్, మే 27

ఒక ఎకరం సగటున 15 బస్తాల ధాన్యాన్ని పండించేదిగా ఉండే 15 స్టాండర్డు ఎకరాలను కుటుంబ పరిమితిగా ఒరిస్సాలో భూపరిమితిని నిర్ణయించాలని, ఒరిస్సా ప్రజాసోషలిస్టుపార్టీ కార్యవర్గం తీర్మానించింది

గత శాసనసభలో 30 స్టాండర్డు ఎకరాలుండాలని ప్రభుత్వం భూసంస్కరణలబిల్లును ప్రవేశపెట్టింది

బాల్కన్‌ప్రాంతంలో అణ్వస్త్ర రహిత శాంతి మండలం అవసరం

ఆల్బేనియాలో ప్రసంగిస్తూ సోవియట్ ప్రధాని కృశ్చేవ్ ప్రతిపాదన

రోజుకు రూపాయిన్నర కనీస వేతనంగా నిర్ణయించాలి

కూలిరేటుపైనా, పాలేరుజీతంపైనా ఆంధ్ర ప్రదేశ్ వ్యవసాయ కార్మికసభ తీర్మానం

పెనుమంట్ర, మే 25

వ్యవసాయ కార్మికులకు రోజుకు రూపాయిన్నర చొప్పున కనీస వేతనంగా నిర్ణయించాలనీ, ఆయా ప్రాంతాల్లోని రోజువారీ కనీస వేతనానికి 365 రెట్లకంటే తగ్గకుండా వుండేటట్లు పాలేరు జీతం నిర్ణయించాలనీ ఇక్కడ జరుగుతున్న ఆంధ్ర ప్రదేశ్ వ్యవసాయ కార్మిక మహాసభ తీర్మానించింది

శ్రీ గుంటూరు బాపనయ్యగారు
ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘ అధ్యక్షుడు

ఇక్కడ జరుగుతున్న ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక మహాసభకు 320 మంది ప్రతినిధులు వచ్చారు ప్రతినిధుల సమావేశంలో కార్యదర్శి శ్రీ టి గోవిందయ్య నివేదిక ప్రవేశపెట్టారు.

నివేదికపై జరిగిన చర్చలో శాసనసభ్యులు శ్రీ స్వర్ణ వేమయ్య (నెల్లూరుజిల్లా) మాట్లాడుతూ గ్రామాలలో హరిజనులపై జరుగుతున్న అత్యాచారాలను వివరించారు "నెల్లూరుజిల్లా కావలి తాలూకాలో ఒక గ్రామంలో అగ్నిప్రమాదం సంభవించింది ఆ మంటలను ఆర్పడానికి వెళ్ళిన వ్యవసాయ కార్మికులపై నేరం ఆరోపించి సొమ్ములు వసూలు చేశారు హైదరాబాద్ జిల్లా అమీర్‌పేటలో మంత్రి శ్రీ రంగారెడ్డి అనుచరులు అక్కడి వ్యవసాయ కార్మికులపై దారుణహింసాచర్యలు" జరిపారు ఇటువంటి దురంతాలను అరికట్టడానికి కృషి చేయాలి"

సాంఘికాభివృద్ధికోసంకూడా వ్యవసాయ కార్మిక సంఘం కృషి చేయాలనీ, హరిజన తెగలమధ్య అంతర్వర్ణ వివాహాలు ప్రోత్సహించాలనీ శ్రీ వేమయ్యగారన్నారు.

శాసనసభ్యులు శ్రీ కంజి నాగేశ్వరరావు (తూర్పు గోదావరి) లంక భూములను వేలం వేసే విధానానికి వ్యతిరేకంగా తమ జిల్లాలో జరిగిన ఆందోళనను తెలియజేశారు

శ్రీ కంజి భాస్కరరావు (కృష్ణాజిల్లా) మాట్లాడుతూ పంచవర్ష ప్రణాళికలు ధనిక వర్గాలకే తోడ్పడుతున్నాయి గాని పేద ప్రజలకు ఏమీ వినియోగ పడటంలేదనీ, వారి జీవిత ప్రమాణాలు ఏమీ పెరగడంలేదనీ అన్నారు వ్యవసాయ కార్మికులు తమ సమస్యల పరిష్కారంకోసం అవసరమైతే సత్యాగ్రహ పోరాటాన్ని చేబట్టాలన్నారు

శ్రీ కొండ్రు సుబ్బారావు (పశ్చిమ గోదావరి) మాట్లాడుతూ బంజరు భూములను సహకార సంఘాలద్వారా సాగుచేయించడంలో వచ్చిన అనుభవాలను తెలియజేశారు

ఏలూరు తాలూకాలో మొత్తం 800 ఎకరాల బంజరు భూమి ఇప్పుడు వ్యవసాయ కార్మికసహకారసంఘాలద్వారా సాగు అవుతున్నదనీ, కార్యకర్తలకు తర్ఫీదు చేయడం ముఖ్యంగా ఉందని అన్నారు

శ్రీ దోనేపూడి సూ. పె. (గుంటూరు జిల్లా) మాట్లాడుతూ జమాబందీల సందర్భంలో పెనాల్టీలకు వ్యతిరేకంగా తము జరిపిన ఆందోళనను తెలియజేశారు. అర్జీలు యిప్పించడంలో జరిపిన కృషిని చెప్పారు

మహాసభకు సోదర ప్రతినిధిగా వచ్చిన సర్వోదయ కార్యకర్త శ్రీ ప్రత్తి శేషయ్య (పశ్చిమగోదావరి) మాట్లాడుతూ "భూమిమీద కొద్దిమందికి వున్న యాజమాన్యాన్ని తొలగించాలన్నారు భూమిపై కష్టపడే ప్రజలకు యాజమాన్యం లభించాలంటే భూసంస్కరణలు వెంటనే అమలు జరపాలన్నారు.

వ్యవసాయ కార్మికుల జీవిత పరిస్థితులను మెరుగుపరచడానికి కృషి చేస్తున్న కేరళ ప్రభుత్వంపై జరిగే కుట్రను ఆంధ్ర ప్రజలు తీవ్రంగా నిరసించాలన్నారు.

మరికొందరు మాట్లాడిన తరువాత కార్యదర్శి శ్రీ గోవిందయ్యగారు చర్చకు సమాధానం యిచ్చారు ప్రతినిధులు సూచించిన స్వల్పసవరణలతో నివేదికను సమావేశంవారు ఆమోదించారు

కూలీరేట్లు, పాలేళ్ళ జీతాలపై తీర్మానం

కూలీరేట్లపై చేసిన తీర్మానంలో ఇలా తెలియజేశారు

ప్రధానంగా వ్యవసాయపు పనులు చేసుకుని బ్రతకాల్సిన వ్యవసాయ కార్మికుల సంఖ్య మన గ్రామసీమలలోని మొత్తం జనాభాలో నూటికి 40-45 మందులవరకూ వుంది వ్యవసాయపు పనులు బాగా లభించే ప్రాంతాలలోకూడ వ్యవసాయ కార్మికులకు సంవత్సరంలో ఆరు, ఏడు మాసాలకంటే హెచ్చుకాలం పని అందుటలేదు కడమ్మా కాలం అంతా వ్యవసాయ కార్మికులు నిరుద్యోగంతో, ఆకలిమంటలతో అలమటిస్తూ వుండవలసివస్తోంది.

ఏదో కొన్ని ఉత్తడి తరుణాలలో తప్ప వ్యవసాయ పనులున్న రోజులలో సహితం లభించే వేతనాలు చాలా నికృష్టంగా వున్నాయి రాష్ట్రం మొత్తంమీదా కూలీరేట్లు, పాలేళ్ళజీతాలు ఒకేరకంగాలేవు రు 0-6-0 నుండి 1-0-0,1-4-0 వరకూ ఆయా ప్రాంతాలలోని వ్యవసాయార్థిక పరిస్థితులను బట్టి, మనవ్యవసాయకార్మిక ఉద్యమ స్థాయిని బట్టి దిన కూలీరేట్లు వుంటున్నాయి

ఇక పాలేళ్ళజీవితం మరీ దుర్భరంగా వుంది రేయనక, పగలనక భూస్వామి ఆజ్ఞప్రకారం వాళ్ళు విరామం లేక పని చేయాలి రోజూ 14-16 గంటలు చాకిరీచేయాలి ఏ ప్రాంతంలో కూడ 12 గంటల కనీసచాకిరీకి తక్కువలేదు సెలవులు వుండవు నాగాలుపడితే జీతం విరగ్గోయడం సర్వసామాన్యం

ఆ జీతాలు కూడా మహాదారుణంగా వుంటున్నాయి తూర్పుగోదావరిజిల్లా రాజోలుతాలూకాలాంటి సారవంతమైన ప్రాంతంలోనే పాలేరుకు సంవత్సరానికి 12 బస్తాలకంటే జీతం ఎక్కువ యివ్వడంలేదు వ్యవసాయ కార్మిక వుద్యమంవల్ల కొంతవరకు హెచ్చు జీతాలు సాధించుకున్న కృష్ణా, గుంటూరుజిల్లాలలోకూడ నేడు సర్వసామాన్యంగా 15 బస్తాలనుండి 22 బస్తాలవరకు మాత్రమే వున్నాయి. రాయలసీమ జిల్లాలలో నెల్లూరు అయిన పాలేరుకు అన్నం పెట్టి, బట్టలు వగైరా యిచ్చి జీతం క్రింద రు 150/-లు మొదలు రు 250/-లు మాత్రం యిస్తున్నారు

చిన్న జీతగాండ్రు, పశువుల కాపరులకంటే మరీ నికృష్టంగావుంది వీళ్ళకు సంవత్సరానికి 3, 4 బస్తాలనుండి 7, 8 బస్తాలవరకూ జీతాలున్నాయి

తెలంగాణా, రాయలసీమల్లాంటి తరచు కరువు కాటకాలకు గురి అయ్యే ప్రాంతాలనుండి, నెల్లూరు, గుంటూరు జిల్లాల మెట్ట ప్రాంతాలనుండి వ్యవసాయ కార్మికులు కృష్ణా, గోదావరి డెల్టాప్రాంతాలకు ఏటేటా వలసలు వస్తున్నారు ఇటీవల సంవత్సరాలలో యీ వలసలు మరీ అధికమయ్యాయి ఆకారణంగా కృష్ణా, గోదావరి డెల్టా ప్రాంతాలలోని వ్యవసాయ కార్మికులు కార్తీక మాసాలలో (పనులు లేని రోజులలో) వేరుశనగతీత, కోత వగైరా పనులకు ఆ జిల్లాలలోని మెట్టప్రాంతాలకు, యితర మెట్ట ప్రాంతాలకు పనులకై పోతున్నారు ఈ వలసలకు తోడు పారిశ్రామిక, వర్తక వాణిజ్యరంగాలలో సంక్షోభం తీవ్రంగావడం, చేనేత వగైరా చేతివృత్తులు దివాలాతీయడంవల్ల ఆ వృత్తులపై జీవించేవారుకూడ వ్యవసాయపు పనులకు ఎగబడుతున్నారు ఈ పరిస్థితులను ఆధారంగాతీసుకొని పనివున్న రోజులలో సహితం భూస్వాములు కూలీరేటులను విరగ్గోస్తున్నారు

(మిగతా 2వ పేజీలో)

పట్టణకార్మికుల, వ్యవసాయ కార్మికుల ఐక్య సంఘటన శక్తి

ప్రాధాన్యతను వివరిస్తూ ప్రదేశ్ వ్యవసాయ కార్మిక మహాసభకు మాస్కోనుండి శ్రీ సుందరయ్యగారి సందేశం

పెనుమంట్ర, మే 25

"పట్టణ కార్మికుల, గ్రామీణ వ్యవసాయ కార్మికుల ఐక్యసంఘటితశక్తి తదితర మధ్యతరగతిని, కడకు ధనికవర్గాలలో ఒకభాగాన్ని కూడగట్టుకొనిరాగలదు" అని కమ్యూనిస్టు నాయకులు, ఆంధ్ర ప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘ ఉపాధ్యక్షులు అయిన శ్రీ సుందరయ్యగారు మాస్కోనుండి పంపిన ఒక సందేశంలో పేర్కొన్నారు

ప్రదేశ్ వ్యవసాయ కార్మిక మహాసభ ఇక్కడ జరుగుతున్న సందర్భంలో శ్రీ సుందరయ్యగారు సందేశం పంపారు చికిత్స నిమిత్తం ఆయన ప్రస్తుతం మాస్కో సమీపంలోవున్న బెర్విహా శానిటోరియంలో ఉన్నారు వారి సందేశంలో ఇలా ఉంది

"ప్రదేశ్ వ్యవసాయకార్మికమహాసభ మే నెల 25,26 తేదీలలో పశ్చిమ గోదావరిజిల్లాలోని పెనుమంట్రలో జరుపుతున్నట్లు "విశాలాంధ్ర" పత్రికలో చూశాను మహాసభ జయప్రదంగా జరుగుతుందనడంలో సందేహం లేదు

"గ్రామసీమలలో మన వ్యవసాయ కార్మిక వర్గాన్ని ఎంత ఎక్కువగా సంఘటితపరచి, చైతన్యవంతం చేయగలమో దానిని బట్టి మన ప్రజల భవిష్యత్తును పెంపొందించుకో గలము ప్రతి కుటుంబానికి భూమిని సాధించగల్గినప్పుడే పూర్తిగా మన జాతికి, కష్టజీవుల నిజమైన సోషలిస్టు ప్రజారాజ్యానికి పునాదులు వేయగలము పేద, మధ్యతరగతుల రైతాంగాన్ని మనం ఎప్పుడూ కలుపుకొని రావడానికి కృషిచేస్తూంటాము కాని వ్యవసాయ కార్మికవర్గాన్ని సంఘటితపర్చి చైతన్యవంతంగా చేయజాలనంతవరకు మన పోరాటం విజయవంతం కాజాలదు ఆంధ్రలో గ్రామసీమలలో వారు నూటికి 50 మందికిపైగా ఉన్నారు ప్రతి కుటుంబానికి భూమి, వుండటానికి ఇల్లు,కనీసవేతనాలు,విద్యా వైద్యసౌకర్యాలుసాధించాల్సివుంటుంది ఆహార ధాన్యాలధరలు పెరిగి పోతున్నట్లు పత్రికలలో చూస్తున్నాను వీటిని అదుపులో పెట్టించడానికి కూడా మనం పోరాడవలసిఉంది. దీని కంతా కీలకం, గ్రామాలలో రాష్ట్రమంతా చైతన్యవంతమైన ఈ వ్యవసాయ కార్మిక సంఘాలను ఏర్పరచగలిగినప్పుడే సాధ్యమవుతుంది ఇందుకు మనం ప్రత్యేక కృషి చేయవలసి వుంటుంది

"పట్టణ కార్మికుల, పేదల, గ్రామీణ వ్యవసాయ కార్మిక పేదప్రజల సంఘటిత చైతన్యశక్తి తదితర మధ్యతరగతి వారిలోనూ, కడకు ధనికవర్గాలలోనూ కూడా ఒక భాగాన్ని సమీకరించ గలదు

"త్వరలో మన దేశానికి వచ్చి మన వ్యవసాయ కార్మికులలో తిరిగి నాశక్తి కొలది పని చేయడానికి పూనుకుంటాను మిత్రులకు, కార్యకర్తలకు నా అభినందనలు తెలియజేయండి"

ఆరోగ్య పరిస్థితి

తాను క్రమంగా కోలుకుంటున్నాననీ ఆహారం బాగా తీసుకుంటున్నాననీ శ్రీ సుందరయ్యగారు తన లేఖలో తెలియజేశారు

జూన్ నెలాఖరుకు తాను భారతదేశానికి తిరిగి రాగలనన్నారు రోజుకు ఆరు ఏడు గంటలు నిద్రపడుతున్నదనీ, విశ్రాంతి కాలంలో రష్యను భాషను నేర్చుకుంటున్నాననీ, శ్రీ సుందరయ్యగారు తెలియజేశారు

ఇటలీలో రాకెట్ స్థావరాలను స్థాపించటం ప్రమాదకరమని హెచ్చరిక

లండన్, మే 26

బాల్కన్ ప్రాంతాన్ని రాకెట్లూ, అణ్వస్త్రాలూ లేకుండా, శాంతి మండలంగా ఏర్పరచాలని, సోవియట్ యూనియన్ ప్రధాని కృశ్చేవ్ ఆల్బేనియాలో చెప్పారని మాస్కో రేడియో ప్రసారం చేసింది

ఆల్బేనియాలో, [illegible] కృశ్చేవ్ ప్రసంగిస్తూ ఇంకా ఈవిధంగా చెప్పారు

సోవియట్ యూనియన్, ఇతర సోషలిస్టు దేశాలమీదా, ఆల్బేనియామీదా, ఉపయోగించేందుకు, ఈ దేశంలో రాకెట్ల స్థావరాలను ఏర్పాటుచేసేందుకు ఇటలీ అంగీకరించిందన్నారు

ఆల్బేనియా పొరుగునగల గ్రీసుకూడ అట్టి నిర్ణయాన్నే తీసుకొనేటట్లుంది ఈ నిర్ణయాలు సహేతుకంగా లేవనీ, ఆ నిర్ణయాలు గ్రీసు, ఇటలీ ప్రజల ప్రయోజనాలకు విరుద్ధంగా ఉన్నాయన్నారు.

జెనీవా విదేశాంగ మంత్రుల సమావేశాన్ని గురించి ఆయన ప్రస్తావిస్తూ పశ్చిమ రాజ్యాలవారు అంగీకారానికి సుముఖంగా లేనట్లు స్పష్టంగా కన్పిస్తున్నదన్నారు

సోవియట్ యూనియన్ విధానాన్ని పశ్చిమరాజ్యాల అనంగీకార వైఖరికి పూర్తి వ్యతిరేకంగా ఉన్నదనేది రుజువవుతూనే ఉన్నదన్నారు

తిరానాలో, స్టాలిన్ బట్టలమిల్లు కార్మికుల పెద్ద సమావేశంలో కృశ్చేవ్ ఇంకా ఈ విధంగా ప్రసంగించారు

ఉభయ జర్మనీలతో శాంతి సంధి ఒడంబడిక సోవియట్‌యూనియన్‌కు కుదరకపోయినట్లయితే, తన దేశం ఒక్క తూర్పు జర్మనీతో సంధిచేసుకుంటుందని ఆయన హెచ్చరించారు

పశ్చిమ జర్మనీతో కూడ శాంతి సంధికి సోవియట్ యూనియన్ ప్రయత్నిస్తుందన్నారు సోవియట్ యూనియన్‌తో తమకూ శాంతి సంధి అవసరమేనన్న సంగతిని పశ్చిమ జర్మనీవారు కొంత కాలంలో గుర్తిస్తారన్నారు

ప్రపంచంలో సరైన విధానాలను గనుక అనుసరిస్తే, సంఘర్షణలు ఉండవని చెప్పవచ్చు యుద్ధం లేకుండా చేయడానికి, సోవియట్ యూనియన్, ఇతర సోషలిస్టు దేశాలు చేయగలిగినదంతా చేస్తున్నవని కృశ్చేవ్ చెప్పారు

అణ్వస్త్రాలూ, రాకెట్లూ లేకుండా, బాల్కన్ జలసంధి శాంతిమండలంగా ఏర్పడడం చాల తేలికైన పని అని చెప్పారు ప్రపంచంలో ఇంకా ఎక్కువ ప్రాంతాల్లో అణ్వస్త్రాలు లేకుండా చేసుకునే పద్ధతిని అనుసరించాలి

సోషలిస్టు శిబిరం యొక్క బలమూ, శక్తి అజేయమని నొక్కి వక్కాణించారు సోషలిస్టు శక్తులు దినదినమూ అభివృద్ధి చెందుతున్నాయన్నారు పశ్చిమ దేశాలకన్నా, సోషలిస్టు దేశాల సైనిక సంపత్తి అధునాతనమైందనీ, శక్తివంతమైందనీ చెప్పారు

అయినా, తాము కోరేది శాంతి తామెన్నడూ యుద్ధాన్ని ప్రారంభించమన్నారు

ఇరాక్ ప్రధానికి నాజరు రహస్య లేఖ

బీరుట్, మే 26

ఇరాక్ ప్రధాని కాసింకు, ఐక్య అరబ్బు రిపబ్లిక్ అధ్యక్షుడు నాజరు 'శాంతి ప్రతిపాదనను రహస్యంగా' మధ్యవర్తిద్వారా పంపారు మధ్యవర్తిత్వం వహించింది, కైరోగాని, టెహరాన్‌గాని అయి ఉంటుందనుకుంటున్నారు

డల్లెస్ మరణానికి కృశ్చేవ్ సంతాపం

ఆల్బేనియాలోని కార్మిక సమావేశంలో ప్రసంగం

మాస్కో, మే 27

తూర్పు యూరపు రాజ్యాల్లో కమ్యూనిజంపై పోరాటాన్ని వదలి పెట్టినందుకు డల్లెస్ ధైర్యాన్ని సోవియట్ యూనియన్ ప్రధాని కృశ్చేవ్ ప్రశంసించారని టాస్ వార్తా సంస్థ ప్రకటించింది

ఆల్బేనియాలోని తిరానా కార్మిక సమావేశంలో కృశ్చేవ్ ప్రసంగిస్తూ, యింకా ఈ విధంగా చెప్పారు

సోవియట్ యూనియన్ ఉప ప్రధాని మికోయాన్, అమెరికా వెళ్ళినపుడు ఆయన డల్లెస్‌తో మాట్లాడారు ఆ సంభాషణల్లో, తూర్పు యూరపు రాజ్యాల్లో కమ్యూనిజంపై పోరాటాన్ని డల్లెస్ వదలుకుంటున్నట్లుగా మికోయాన్‌కు తోచింది

డల్లెస్‌గురించి అట్లా చెప్పడమంటే, డల్లెస్ కమ్యూనిస్టు సిద్ధాంతాన్ని గుర్తించినట్లుగానీ, దానికి వ్యతిరేకంగా సిద్ధాంత పోరాటాన్ని విరమించినట్టుగానీ అర్థంకాదని కృశ్చేవ్ చెప్పారు

తూర్పు యూరపు రాజ్యాల్లో, కాలంతీరిన పాత వ్యవస్థను పునరుద్ధరించాలని అమెరికాలో కొన్ని నిర్దిష్టమైన శక్తులు ప్రయత్నించినపుడు ఆ పాతపద్ధతులను డల్లెస్ విడనాడాడని అర్థమని కృశ్చేవ్ విస్పష్టం చేశారు

ఈ విధానంలో గల తెలివితక్కువతనాన్ని, చివరకు డల్లెస్ గుర్తించాడు డల్లెస్ తన ధోరణిని ఈ విధంగా ఒప్పుకున్నపుడు, డల్లెస్‌ను మెచ్చుకోకుండా ఉండలేకున్నారు. అట్టి ప్రకటన డల్లెస్ చేయడం ధైర్యంతో కూడిన పని అన్నారు

సోవియట్ యూనియన్ ప్రభుత్వ నేతగా, డల్లెస్ ఒప్పుకోలును తాను మెచ్చుకుంటానన్నారు

రాజ్యాంగ సమస్యపై పాక్ నియంత ప్రకటన

కరాచీ, మే 26

ఈ సంవత్సరంలోగా, పాకిస్తాన్‌కు రాజ్యాంగ చట్టం రూపొందించేందుకు ఒక సంఘాన్ని నియమిస్తామని పాకిస్తాన్ నియంత ప్రకటించారు

ఢిల్లీలోని సింహళం హైకమిషనర్ సర్ రిచర్డ్ అలువిహార్ శుక్రవారం నాడు ముస్సోరిలో దలైలామాతో 90 నిముషాలపాటు సంభాషణలు జరిపారు

ఉష్ణోగ్రత

విజయవాడ, మే 27

విజయవాడలో నేడు ఉష్ణోగ్రత 110 డిగ్రీలు వుంది

విజయవాడలోని 'ఆంధ్రప్రభ' కోసం యంత్రాల తరలింపు

గోయంకాకు మద్రాసు హైకోర్టు అనుమతి

మద్రాసు, మే 26

ప్రస్తుతం మద్రాసులోని ఎక్స్‌ప్రెస్ ఎస్టేట్ ఆవరణలోవున్న కొన్ని యంత్రాలను విజయవాడలోని ఆంధ్ర ప్రభ ప్రయివేట్ లిమిటెడ్‌వారికి అప్పగించేందుకు "ఎక్స్‌ప్రెస్ న్యూస్ పేపర్స్ ప్రయివేట్ లిమిటెడ్"వారికి నేడు మద్రాసు హైకోర్టు అనుమతి నిచ్చింది

ఏప్రిల్ 29వ తేదీన చేసుకొన్న ఒడంబడిక ననుసరించి, తాము విజయవాడ కంపెనీకి ఈ యంత్రాలను అమ్మివేసినట్లూ, ఆ ఒడంబడిక ననుసరించి ఆ యంత్రాలను అప్పజెప్పవలసిందిగా వారు తమకు నోటీసు యిచ్చినట్లూ మద్రాసు కంపెనీవారు హైకోర్టుకు పెట్టుకొన్న అప్లికేషన్‌లో పేర్కొన్నారు

న్యాయమూర్తి శ్రీ యస్ రామచంద్ర అయ్యర్ యీ తీర్పునిస్తూ ఈ యంత్రాలను అడ్వకేట్ శ్రీ జి కృష్ణమూర్తిఅయ్యర్ సమక్షంలో విజయవాడ కంపెనీకి అప్పజెప్పాలని కోరారు గురువారం నాడు యంత్రాలను అప్పజెప్పాలనికూడా ఆయన తన తీర్పులో పేర్కొన్నారు

మద్రాసు ప్రభుత్వం యిచ్చిన రెండు ఆర్డర్లను సవాలుచేస్తూ ఎక్స్‌ప్రెస్ న్యూస్‌పేపర్స్ లిమిటెడ్ కంపెనీవారు దాఖలుచేసుకొన్న రెండు రిట్ పిటీషన్లు ప్రస్తుతం పెండింగ్‌లో వున్నాయి పెండింగ్‌లోవున్న ఆ రెండు పిటీషన్లను కోర్టువారు త్రోసిపుచ్చిన పక్షంలో ఆ యంత్రాలు యిప్పుడు ఎక్కడవున్నారో అక్కడే వుంచే హామీని మద్రాసు, విజయవాడ కంపెనీలనుండి సంయుక్తంగానూ, వేరువేరుగా హామీని పుచ్చుకొన్న తరువాతనే న్యాయమూర్తి ఆ యంత్రాలను కదిలించడానికి ఆర్డరు జారీచేశారు

మద్రాసుకంపెనీ దాఖలుచేసుకొన్న రెండు రిట్ పిటీషన్లు వేసవి సెలవుల అనంతరం విచారణకు వస్తాయి ఆంధ్ర ప్రభ దినపత్రిక, వారపత్రికను విజయవాడ కంపెనీకి ట్రాన్స్‌ఫర్ చేయడం న్యాయసమ్మతమో కాదో తేల్చవలసిందిగా పారిశ్రామిక ట్రిబ్యునల్‌ను మద్రాసు ప్రభుత్వం కోరింది దీనిని గోయంకా సవాలుచేస్తూ ఒక రిట్ పిటీషన్ దాఖలు చేశారు

ఎక్స్‌ప్రెస్ న్యూస్ పేపర్స్ లిమిటెడ్ కంపెనీవారు ఆపివేసిన ఏడు పత్రికలను తిరిగి ప్రచురించవలసిందిగా పారిశ్రామిక ట్రిబ్యునల్ కోరింది దానినికూడా సవాలుచేస్తూ గోయంకా మరొక రిట్ పడవేశారు.

రష్యా ప్రధానితో ఆల్బేనియా నాయకుల సమావేశం

బెల్గ్రేడ్, మే 26

సోవియట్ ప్రధాని కృశ్చేవ్, ఆల్బేనియా కమ్యూనిస్టు నాయకులు వివిధ సమస్యలన్నిటిపై సాగించిన సంభాషణల్లో పూర్తి ఐక్యత ద్యోతకమైందని, ఆల్బేనియా వార్తాసంస్థ "ఆటా" ప్రకటించింది

నిన్న కృశ్చేవ్ ఆల్బేనియా కరుదెంచిన సందర్భంలో, ఆల్బేనియా కమ్యూనిస్టు నాయకుడు ఎన్వర్‌హోక్సా, ఆల్బేనియా ప్రధాని మెహమెత్ షెహూలు ఆయనను కలుసుకున్నారు సోవియట్ ప్రధానితో వారు జరిపిన ప్రథమ సమావేశంలో వివిధ సమస్యలపై చర్చించారు కృశ్చేవ్ ఆల్బేనియాలో పన్నెండురోజులుంటారు

సంభాషణలు సుహృద్భావ సోదర స్నేహపూర్వక వాతావరణంలో జరిగినవని ఆ వార్తాసంస్థ ప్రకటించింది

ఆ సంభాషణల్లో సోవియట్ రక్షణ మంత్రి మాలినోవస్కీ, ఆల్బేనియా రక్షణమంత్రి బల్లూకుకూడా పాల్గొన్నారు

కేరళ పరిస్థితిపై శాసన సభలో ప్రశ్నోత్తరాలు

తిరువనంతపురం, మే 26

కేరళ రాష్ట్రంలో కొంతమంది కుల నాయకులు చేస్తున్న ప్రసంగాలూ, ప్రకటనలూ, ప్రదర్శనలూ ప్రభుత్వం గమనించిందనీ, వారి చర్యలు రాష్ట్రంలో శాంతినీ, కులాలమధ్యగల సుహృద్భావాన్నీ భంగపరచవచ్చునని, కేరళ ముఖ్యమంత్రి శ్రీ నంబూద్రిపాద్ నేడు శాసనసభలో ప్రశ్నోత్తర సమయంలో చెప్పారు

దౌర్జన్యాలు ఎక్కడ జరిగినా ప్రభుత్వం చట్టరీత్యా చర్యలు తీసుకుంటుందని శ్రీ నంబూద్రిపాద్ చెప్పారు

అట్టి కులతత్వ ప్రచారాన్ని సాగిస్తున్న వారిపేర్లను చెప్పడానికి ముఖ్యమంత్రి నిరాకరించారు అవసరం ఏర్పడినప్పుడు, వారిపై ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని చెప్పారు.

ప్రశ్న: కులతత్వ వాదుల చర్యలను గురించి ప్రభుత్వానికి ఏమైనా అధికారయుత నివేదిక అందిందా?

ఆ ప్రశ్నకు, శాంతిభద్రతల మంత్రి శ్రీ అచ్యుతమీనన్ సమాధానమిస్తూ, పోలీసు రిపోర్టులు ప్రభుత్వానికి అందాయనీ, వాటిలోగల విషయాలను తాను వెల్లడించ కూడదన్నారు

విజయవాడ
శ్రీనివాస మహల్ - శ్రీ రామాటాకీస్‌లలో
ఒకేసారి విడుదల!
29-5-59 మ్యాటినీతో ప్రారంభం
దక్షిణ భారతంలో కనకవర్షం కురిపించి,
అనేక కేంద్రాలలో శతదినోత్సవాలు,
రజతోత్సవాలు జరుపుతున్న
యం జి ఆర్ ఎక్సర్స్‌వారి

అనగా అనగా ఒకరాజు
(తెలుగు)

(గేవా కలర్‌లో నిండిన చిత్రం)
తారాగణం
భానుమతి, యం. జి రామచంద్రన్,
సరోజాదేవి చంద్రబాబు
—రమిత్రియా రిలీజ్

వికారి నామ సంవత్సర
వైశాఖ బహుళ
షష్టి ఉ 7-4
ధనిష్ఠ తె 4-28

విశాలాంధ్ర
గురువారం 28-5-1959

నిరుద్యోగ సమస్య

దేశంలో నిరుద్యోగుల సంఖ్య రోజు రోజుకు పెరుగుతున్నదనీ, తృతీయ ప్రణాళిక కాలంలో మొత్తం 2 కోట్ల పది లక్షల మందికి ఉద్యోగాలు చూపించవలసి వుంటుందనీ, కేంద్ర ప్రణాళికా మంత్రి శ్రీ నందా ఉద్యోగ విచారణ కమిటీ సమావేశంలో అన్నారు విద్యావంతులలో నిరుద్యోగ సమస్య మరింత తీవ్రంగా ఉన్నదని, దీనిని పరిష్కరించడానికి ప్రభుత్వం తలపెట్టిన పథకాలు తృప్తికరంగా లేవని కూడా అంగీకరించారు 'ఏవో కొన్ని 'సాంప్రదాయ విరుద్ధమైన' పద్ధతులను అవలంబిస్తే తప్ప నిరుద్యోగ సమస్యను పరిష్కరించలేమని తెలియజేశారు

నిరుద్యోగ సమస్య తీవ్రతను గుర్తిస్తూ, ప్రభుత్వ పథకాలు సంతృప్తికరంగా లేవని అంగీకరిస్తూ శ్రీ నందా ప్రసంగించటం సముచితంగా ఉంది. అయితే ఆయన సూచించిన 'సాంప్రదాయ విరుద్ధ పద్ధతులు' మాత్రం సమస్యాపరిష్కారానికి తగినట్లు లేవు పైపెచ్చు ప్రభుత్వ నిస్సహాయతకు తార్కాణంగా ఉన్నాయి

పెట్టుబడిదారులు పరిశ్రమలను అకారణంగా మూసివేస్తున్నారని, వాటిని ప్రభుత్వం స్వాధీనంచేసుకొని నిర్వహించటం చాలా భారమౌతున్నదని నందా అన్నారు అలాంటి సందర్భంలో సహకార ప్రాతిపదికపై ఆ పరిశ్రమను నడిపే విషయం ఆలోచించాలన్నారు విద్యార్థులలో నిరుద్యోగాన్ని తగ్గించేందుకై హైస్కూళ్ళలోను, కాలేజీలలోను ఉత్తీర్ణులయ్యే విద్యార్థుల సంఖ్యను పరిమితం చేయటం కూడా అవసరమన్నారు.

ఇటీవల పెట్టుబడిదారులు తమకు తగినంతగా లాభాలు రాలేదన్న సాకుతో పరిశ్రమలను మూసివేస్తున్నమాట నిజం మధురలో బట్టల మిల్లులు ప్రస్తుతం ఇదేవిధంగా మూయివేయబడి ఉన్నాయి ఇందువలన 22 వేలమంది కార్మికులు నిరుద్యోగులైనారు. అలాగే దేశంలో పెక్కుచోట్ల యజమానులు పరిశ్రమలను మూసివేస్తున్నారు అయితే ఇందుకు కారణం పెట్టుబడిదారులకు తగినంతగా లాభాలు రాకపోవటం మాత్రం కాదు అధిక లాభాలను ఆర్జించాలని, కార్మికులను ఏదో సాకుతో తొలగించాలనే పెట్టుబడిదారులదృష్టే ఇందుకు కారణం

ఈ వాస్తవాన్ని శ్రీ నందా గుర్తించినట్లయితే, "చాలా సందర్భాలలో మూసివేయబడిన పరిశ్రమలను నడపడం ఆర్థికంగా నష్టకరంగా తయారవుతున్నది" అని చెప్పవలసిన పని లేదు పెట్టుబడిదారుల బూటకపు వాదనలను యథాతథంగా అంగీకరించటంవలననే ఈ నిస్సహాయ స్థితికి ప్రభుత్వం వస్తున్నది

బట్టల పరిశ్రమకు ప్రభుత్వం ఎన్నో సౌకర్యాలను కలిగించింది కొత్త యంత్రాలను ప్రవేశపెట్టటానికి అనుమతించింది ఎగుమతికి అవకాశాలను కల్పించింది అయినా బట్టల మిల్లుల యజమానుల లాభతృష్ణ చల్లారలేదు ప్రభుత్వం తమకు కలిగించిన సౌకర్యాలన్నిటినీ స్వలాభానికి వినియోగించుకుని, కార్మికులనునిరుద్యోగంపాలు చేయటానికి, పరిశ్రమలను మూసివేసి కృత్రిమంగా వస్త్రసంక్షోభం కలిగించటానికి పూనుకుంటున్నారు ఇలాంటి సందర్భాలలో ప్రభుత్వం కఠినమైన చర్యలు తీసుకోవాలి కంపెనీల అక్కౌంట్లను, లాభనష్టాలను జాగ్రత్తగా పరిశీలించి కంపెనీ యావదాస్తులను స్వాధీనం చేసుకుని పరిశ్రమలను నిర్వహించటానికి పూనుకోవాలి లాభాలను దాటవేసి, కంపెనీనష్టంమీద నడుస్తున్నదని దొంగ లెక్కలు చూపే పెట్టుబడిదారుల వాదనలకు మోసపోరాదు

కాని ప్రణాళికా మంత్రి సూచనలలో ఇట్టి దృఢమైన వైఖరి ద్యోతకం కావటంలేదు

హైస్కూలు, కాలేజీ విద్యార్థుల సంఖ్య పరిమితం చేయాలన్న వాదన 'సాంప్రదాయ విరుద్ధమే కావచ్చు కాని, అభివృద్ధి నిరోధకమైనది. దేశంలో ఇప్పటికే అవిద్య హెచ్చుగా ఉంది. హైస్కూలు విద్య వరకయినా ప్రతి ఒక్కరికి అవకాశం ఉండకపోతే విజ్ఞానస్థాయి పెరగదు హైస్కూలు విద్య అనంతరం సాంకేతిక శిక్షణకు ఎక్కువ ఏర్పాట్లు చేయవచ్చు, అంతే గాని విద్యను, ముఖ్యంగా హైస్కూలు విద్యను పరిమితం చేయాలనటం సరియైన సూచన కాదు.

శ్రీ నందా ప్రసంగంలో వీటన్నిటికంటె ప్రధాన లోపం మరొకటి ఉంది మన 'ఆర్థిక విధానం అభివృద్ధి దశలో ఉన్నది, కనుక ఈఇబ్బందులన్నీ తప్పవని ఆయన అంటున్నారు ఇది విచిత్రం ఆర్థికవిధానం అభివృద్ధి అవుతూంటె నిరుద్యోగుల సంఖ్య పెరగడం కూడా తప్పని సరి అని నందాగారు భావిస్తున్నారన్నమాట

గుత్త పెట్టుబడిదారీ అర్థశాస్త్రజ్ఞులు ఈ మాట అంటే అర్థంచేసుకో గలం ఏమంటే ప్రజలను నిరుద్యోగానికి, దారిద్ర్యానికి గురిచేసి, తాము మాత్రం కొన్ని పరిశ్రమల నిర్మాణంద్వారా లాభాలు ఆర్జించి అదే ఆర్థిక విధాన అభివృద్ధికి చిహ్నమని చెప్పుకోవటం పెట్టుబడిదారులకు మామూలే కాని సోషలిస్టు సమాజ స్థాపన లక్ష్యాన్ని ప్రకటించుకొన్న భారత ప్రభుత్వ ప్రణాళికా మంత్రి నందా ఇలా అనటం శోచనీయం

మన పొరుగుదేశమైన చైనా మనకంటె హెచ్చుగానే సర్వతోముఖమైన అభివృద్ధి సాధిస్తున్నది ఈ విషయం అందరూ అంగీకరిస్తున్నారు కూడా కాని అక్కడ ఆర్థిక విధానం అభివృద్ధి చెందటంతోపాటు నిరుద్యోగుల సంఖ్య పెరగటంలేదు పైగా వారు నిరుద్యోగ సమస్యను ఏనాడో పరిష్కరించారు

కనుక భారతదేశంలో రోజు రోజుకు పెరుగుతున్న నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలంటే ప్రభుత్వం తన పథకాలను దృక్పథాన్ని సమూలంగా మార్పు చేసుకోవాలి కార్మికులపై భారంహెచ్చించి అధిక లాభాలను ఆర్జిస్తున్న పెట్టుబడిదార్లను అదుపులో పెట్టాలి పబ్లిక్ రంగంలో పెద్దఎత్తునపరిశ్రమలనిర్మాణానికి పూనుకోవాలి సక్రమమైన భూసంస్కరణలను అమలుజరిపి,గ్రామీణ నిరుద్యోగాన్ని పరిష్కరించాలి పెట్టుబడిదారీ "సంప్రదాయ విరుద్ధమైన" ఇట్టిపద్ధతులను ప్రభుత్వం చిత్తశుద్ధితో అమలుజరుపగలిగినప్పుడే నిరుద్యోగ సమస్య పరిష్కారానికి ప్రాతిపదికలు ఏర్పడతాయి

కేరళలో విద్వేషాన్ని రెచ్చగొట్టేయత్నాలు

ప్రతిపక్ష నాయకుల ధోరణి

[కేరళలోని కుల, మత నాయకులూ, ప్రతిపక్షాల నాయకులూ బహిరంగంగా కులమత తత్వాలను రెచ్చగొడుతున్నారు శాసనధిక్కారానికి ప్రజలను పురిగొల్పుతున్నారు చట్టబద్ధంగా ఏర్పడిన ప్రభుత్వాన్ని కూలద్రోయాలని కోరుతున్నారు వారు ఇటీవల చేస్తున్న ప్రకటనలను, ప్రసంగాలను వారికి సంబంధించిన పత్రికలు ప్రచురించిన భాగాలనే యథాతథంగా 'విశాలాంధ్ర' పాఠకుల ముందుంచుతున్నాం —సం]

నాయర్ సేవాసంఘ నాయకుడైన శ్రీ మన్నాత్ పద్మనాభన్ కేరళ ముఖ్యమంత్రికి మార్చి 25వ తేదీన వ్రాసిన బహిరంగలేఖలో యిలా పేర్కొన్నారు

"ఇతర స్కూళ్ళ మేనేజిమెంట్ల అభిమతాన్ని అనుసరించి ఈ విద్యాచట్టం స్థానే నూతన శాసనాన్ని ప్రవేశపెట్టాలని మేము డిమాండ్ చేస్తున్నాము ఈ చట్టాన్ని మీరు ఉపసంహరించుకోనిపక్షంలో మేము ప్రత్యక్షచర్యలకు పూనుకోవడలచామని ఇందుమూలంగా మీకు తెలియజేస్తున్నా."

—"మళయాళీ"పత్రిక, మార్చి 29

కొట్టాయంలో జరిగిన ఒక బహిరంగ సభలో శ్రీ పద్మనాభన్ ప్రసంగిస్తూ యిలా అన్నారు

"వేసవి సెలవుల అనంతరం స్కూళ్లను తెరవవలసిన జూన్ ఒకటవ తేదీన ప్రయివేటుస్కూళ్ళను తెరవబోవటంలేదు అంతేకాదు,ప్రభుత్వస్కూళ్ళనుకూడా మేము తెరవనీయం విద్యాచట్టంలో గాని, భూసంస్కరణల బిల్లులోగాని ఏవో కొద్దిమార్పులుచేసినట్లైతే సంతుష్టపడేవారం కమ్యూనిస్టు మంత్రులు ప్రయత్నిస్తే కొమో అదేమీ వీలుపడదు ఎందుకన్నంటే కమ్యూనిస్టు ప్రభుత్వాన్ని తొలగించడమే మా లక్ష్యం,"

"మళయాళీ"మే 4

శ్రీ పద్మనాభన్ కనమానులో జరిగిన ఒక సభలో, ప్రసంగిస్తూ యిలా అన్నారు

"శాసనసభ ఆమోదించిన ముండస్సేరీ విద్యాచట్టాన్నీ, త్వరలో శాసనసభ ఆమోదించబోయే గౌరీశాసనం (భూసంస్కరణలబిల్లు) చిత్తు [illegible] శక్తి నేను నాయర్లనుండి అవసరమైతే శాసనధిక్కార కార్యక్రమాన్ని ప్రారంభించడానికి మేము నిర్ణయించుకొన్నాం."

—"మళయాళీ", ఏప్రిల్ 28

ప్రభుత్వాన్ని స్తంభింప జేయడానికి పథకం

ప్రజాసోషలిస్టు నాయకుడు శ్రీ పట్టంథానుపిళ్లై సంపాదకత్వాన ప్రచురింపబడుతున్న "కరళ జనత' అనే పత్రికలో మే 10వ తేదీన దాని "రాజకీయ విశేషాలు" వ్రాసినదానిలో యిలా వుంది:

"జూన్ ఒకటవ తేదీన ప్రయివేటు స్కూళ్ళను కేరళలో మూసివేయడంతోపాటు ప్రభుత్వ స్కూళ్ళను తెరవనీయకుండా చేయడంతో నేవారి (ప్రతిపక్షాల) పథకం పూర్తికాదని తెలుస్తోంది అన్నిరంగాల్లోనూ ప్రభుత్వ పనిని స్తంభింపచేయడానికి వారు కార్యక్రమాన్ని వేసుకొన్నట్లు తెలుస్తోంది"

కొట్టాయంలో శ్రీ పద్మనాభన్ మాట్లాడుతూ యిలా అన్నారు

"జూన్ ఒకటవ తేదీ సమీపించుతోంది ఈలోపున మనం చేయవలసింది చాలవుంది మూసివేయబడిన స్కూళ్ళు సరిగా మూసివుంచేటట్లు జాగ్రత్తలను తీసుకోవాలి తెరచే స్కూళ్ళను నిర్బంధంగా మూసివేయించాలి ఈ కార్యక్రమమంతా సరిగా జరగాలంటే లక్షల సంఖ్యలో మనకు వాలంటీర్లు అవసరం ప్రతి ఒక్క తాలూకాలో, ప్రతి గ్రామంలోనూ, ప్రతి పేటలోనూ వాలంటీరు దళాలను నిర్మించుకోవాలి వాటికి నాయకత్వం వహించడానికి కమిటీలు ఏర్పడాలి ప్రతి కమిటీ ఒక నాయకుని క్రిందవుండాలి ఈవిధంగా మీ లక్ష్యసాధకు సదనర్గానికి బయలుదేరి వెళ్ళాలి"

—"దీపిక" మే 5

కేథలిక్ బిషప్పులంతా తమ అనుయాయులకు ఒక సంయుక్త లేఖను పంపారు అందులో ఇలా వుంది

"మైనారిటీలకూ, దేవుని యందు విశ్వాసం వున్న వారికీ వ్యతిరేకంగా కేరళ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు తీవ్రమైన ఆందోళనను కలిగించుచున్నాయి ఈవిషమ పరిస్థితులలో మన అమూల్యమైన మతాన్ని కాపాడుకొనేందుకు మన శక్తినంతటినీ ధారపోద్దాం దయార్ద్రమైన అధికంతుని పాదంలో కలదాచుకొందాం మనం కష్టాలను భరించవలసివుంది బాధలను అనుభవించడానికి సిద్ధపడాలి దేవుడు చెప్పిన మాటలలో తృప్తిపొందుదాం న్యాయంకోసం బాధలుపడేవారు నిజానికి అదృష్టవంతులు ఎందుకంటే అలాంటివారికే స్వర్గం లభించుతుంది"

ఘనక్రాంతి కలిగే రోజు

తిరువనంతపురంలో జరిగిన ఒక సభలో శ్రీ పద్మనాభన్ మాట్లాడుతూ యిలా అన్నారు

"ఒక్క విషయాన్ని చెప్పదలచా ఏమంటే, ఈ కమ్యూనిస్టులను, వారి మూటా ముల్లెతో కేవలం కేరళ నుండే గాక భారత దేశాన్నుండే తరిమి కొట్టి దేశమైన రష్యాకు పంపించినప్పుడే మాకు మన క్రాంతి కలుగుతుంది"

—"మళయాళీ' ఏప్రిల్ 27

తిరువల్లాలో ఏప్రిల్ 12వ తేదీన జరిగిన ఒకసభలో శ్రీ పద్మనాభన్ తన ప్రసంగాన్ని ఈ క్రింది మాటలతో ముగించారు

"కమ్యూనిస్టుల నుండి ప్రభుత్వాన్ని నాయకత్వం చేసుకోబోతున్నాడు కమ్యూనిస్టులు పోయిన తరువాత పరిపాలించేది ఎవరు? అని ప్రశ్నించినవారికి ఒకే ఒక జవాబు అది 'నాయర్'"

— "దేశబంధు," ఏప్రిల్ 14

తిరువనంతపురంలో ఏప్రిల్ 26వ తేదీన జరిగిన సభలో శ్రీ పద్మనాభన్ తన పోరాటాన్ని 'అశ్వమేధయాగం' తో పోల్చుతూ ఇలా అన్నారు

'ఈ విషయమై మీకేమాత్రం సందేహపడ నవసరంలేదు పద్మనాభన్ స్వయంగా తన అశ్వాన్ని సెక్రటేరియట్ భవనాలకు తీసుకొనివెళ్ళి ముఖ్యమంత్రి నంబూద్రిపాద్ ఆఫీసు గదికి కట్టివేస్తాడు"

— మళయాళీ', ఏప్రిల్ 28

బెదరింపులు

ఏప్రిల్ 26వ తేదీన జరిగిన తిరువనంతపురం సభలో శ్రీ పద్మనాభన్ ప్రసంగిస్తూ యిలా అన్నారు

"భగవంతుడి, రక్తపాతానికి అవకాశం లేకుండా మీయంతట మీరే ప్రభుత్వాన్ని విడిచిపెట్టి వెళ్లిపోవలసిందిగా మీకు (కమ్యూనిస్టు మంత్రులు) నేను విజ్ఞప్తి చేస్తున్నాను మంత్రి పదవులకే అంటిపెట్టుకొని వుండడానికి మీరు ప్రయత్నించే పక్షంలో దాని ఫలితాలు అత్యంత ప్రమాదకరంగా వుండగలవని నేను హెచ్చరిక చేస్తున్నాను ఈ మంత్రుల నుండి ప్రాణాలు అధికారాన్ని గుంజుకొని వారిని విచారణకు పెట్టిన పక్షములో వారి ముక్కులూ, చెవులూ కోసి వేయడమే జరుగుతుంది బహిరంగంగా వారిని కొరడాలతో ఎడాపెడా కొట్టవలసి వుంటుంది"

—"మళయాళీ", ఏప్రిల్ 24

తిరువల్లాలో జరిగిన సభలో శ్రీ పద్మనాభన్ మాట్లాడుతూ కేరళ భూసంస్కరణల బిల్లును గురించి ప్రస్తావించి యిలా అన్నారు

"అనవసు భూమిని స్వాధీనం చేసుకొంటామని ఎవరువచ్చి చెప్పినా వారు ప్రాణాలతో బయటపడేదిలేదు అందుకని నేను విచారపడుతున్నాను ఎందుకల్లనంటే ఈ కమ్యూనిస్టు మంత్రులుకూడా బ్రతికే వుండాలనే నా కోరిక"

—"మళయాళీ" ఏప్రిల్ 14

క్విలన్‌లో శ్రీ పద్మనాభన్ ప్రసంగిస్తూ యిలా అన్నారు

"వారికి కరలు కొట్టగల శక్తి వున్నదా అని నాకు సందేహం ప్రభుత్వం ఒక్కటే కొట్టగలదా? మనం కూడా కొట్టగలం ప్రభుత్వాన్నుండి తొలగిపొండి అని వారిని (మంత్రులను) మనం మర్యాదగానే కోరుతున్నాం అలా తొలగిపోని పక్షంలో మనమే వారిని వెంబించివేస్తాం, పదకొండు మందినీ జైలుకు"

—"దేశబంధు", మే 12

మీకే మగతనముంటే

తిరువనంతపురంలో జరిగిన సభలో ప్రజాసోషలిస్టు నాయకుడు శ్రీ పట్టం థానుపిళ్ళై ప్రజలనుద్దేశించి యిలా అన్నారు

"మీకే గనక మగతనముంటే కమ్యూనిస్టుమంత్రులను సెక్రటేరియట్ నుండి బయటకు గెంటివేయాలి ఆత్మగౌరవానికంటే జీవితమంత గొప్పది కాదు మీరు మన శిజాన్నే ప్రద్యోంచితే మూడుసంవత్సరాలు కాదుకదా మూడు రోజులుకూడా వారక్కడ వుండలేరు వారాస్థానంలో వుండబోరని ఘంటాపథంగా చెప్పగలను ఇది చెపుతున్నది పట్టంథానుపిళ్ళ అని తెలుసుకోండి"

—"మళయాళి మనోరమ"ఏప్రిల్ 7

కుల సంఘాలకు చెందిన నాయకులు - నాయర్ సేవాసంఘం, కేథలిక్ చర్చికి చెందిన నాయకులూ యిటీవల చెంగానాచేరిలో నాయకుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు దానికి కాంగ్రెసు, తదితర రాజకీయ పార్టీలకు చెందిన నాయర్, క్రైస్తవ నాయకులు కూడా హాజరయ్యారు

కాంగ్రెసు నాయకుడూ, మాజీ మంత్రి అయిన శ్రీ కలాతిల్ వేలాయుధన్ నాయర్ల సమావేశంలో ప్రసంగిస్తూ విద్యాచట్టానికి వ్యతిరేకంగా జరిగే ఆందోళన చివరికి ఒక రాజకీయ పోరాటంగా అభివృద్ధి చెందాలని కోరారు

కేరళ రాష్ట్ర కాంగ్రెసు కోశాధిపతి శ్రీ పి యస్ జార్జి మాట్లాడుతూ జూన్ మాసంలో రాష్ట్రంలో ప్రతిష్టంభన ఏర్పడుతుందని, దానికి దూరంగా వుండే ఏ రాజకీయపార్టీకి భవిష్యత్తు సాధ్యంకాదనీ అన్నారు

త్రిచూర్‌లో ఏప్రిల్ 18వ తేదీన జరిగిన సభలో మాజీ కాంగ్రెసు ముఖ్యమంత్రి శ్రీ పనంపిల్లి గోవిందమీనన్ మాట్లాడుతూ యిలా అన్నారు:

"కేరళకు సంబంధించినంత వరకూ స్వాతంత్ర్యం పోరాటాన్ని ప్రారంభించవలసిన సమయమాసన్నమైంది. కమ్యూనిస్టులైనా మీకు నేను చెప్తున్నా — ఇదిగో మీకు వ్యతిరేకంగా విముక్తి పోరాటమిది"

—"మళయాళీ" ఏప్రిల్ 16

కాంగ్రెసు నాయకుడు శ్రీ కె యమ్ చండీ కొట్టాయం సభలో మాట్లాడుతూ యిలా అన్నారు

"కొంతమంది అంతర్యుద్ధానికి సన్నద్ధమవుతున్నట్లు ముఖ్యమంత్రి శ్రీ నంబూద్రిపాద్ అన్నట్లు తెలుస్తోంది ఆయన ఏమిచెప్పినా మేము ఆగేదిలేదు అంతర్యుద్ధమే జరిగితే ఈ ప్రభుత్వాన్ని పారద్రోలడానికి మేము పూనుకొంటాం"

—"మళయాళీ" మే 4

వ్యవసాయ కార్మిక మహాసభ

[1వ పేజీ తరువాయి]

ఈ తక్కువ కూలీరేట్లు, పాలేరు వేతనాలకు తోడు రాష్ట్రంలో అనేక చోట్ల వెట్టిచాకిరీ పద్ధతులు, తక్కువ తూనికలు అమలులో వున్నాయి ఫలితంగా కూలీ రేటు, పాలేరు జీతాలలో పరోక్షంగా కోతపడిపోతోంది

వీటికితోడు కరవు మాన్యాలలో భూస్వాములు అప్పులిచ్చి అధిక వడ్డీ చెల్లించే పద్ధతిలో సాగుబడి పెట్టి దారుణంగా దోచుకుంటున్నారు పనిరోజులలో తక్కువ కూలికి పనిచేసేట్లు కార్మికులచేత ఒప్పందాలు చేయించుకుంటున్నారు

ఈ దుర్భర పరిస్థితులనుండి కనీస రక్షణ కల్పించుటకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు యింతవరకు చేసింది శూన్యం

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, తెలంగాణా ప్రాంతము నిజామాబాదు జిల్లాలోను, ఆంధ్ర ప్రాంతం 14 గ్రామాలలోను కనీసవేతనచట్టాన్ని అమలుపర్చింది

అక్కడ మామూలుగా యిచ్చే రేట్లకంటే ప్రభుత్వం ప్రకటించినవి చాల తక్కువగా వున్నాయి

ప్రభుత్వం ప్రకటించిన రేట్లు

నాగలితో దుక్కిదున్నుట	1- 8 0
విత్తుట	0 12 0
ఊడ్పుట	0 12 0
కలుపుతీయుట	0 12 0
కోతలకు	0 12-0

ఈ విధముగ కార్మికులకు ఎట్టిరక్షణ కల్పించకుండా, వేతన నిర్ణాయక సంఘంలో వ్యవసాయ కార్మిక సంఘానికి ప్రాతినిధ్య మియ్యకుండా భూస్వాముల అనుకూల వైఖరి అవలంబించుచున్న ప్రభుత్వ విధానాన్ని ఈ మహాసభ ఖండించుచున్నది

వ్యవసాయ కార్మికుల దారుణ జీవన పరిస్థితులను చక్కబర్చుకోవడానికి సంఘటిత కలిపో భూస్వాముల దోపిడికి వ్యతిరేకంగా పోరాడడం, కనీస వేతనాల నిర్ణయం వగైరా కూలీల కోర్కెలకోసం యెడతెగకుండా ఆందోళన సాగించడం ఒక్కటే మార్గమని యీ మహాసభ హెచ్చరించుచున్నది

ఇందుకోసం కార్మికులను కదిలించ వలసిందిగా యీ మహాసభ కార్మిక సంఘాలను, కార్యకర్తలను ఆదేశిస్తోంది

ఈ క్రింది కోర్కెల సాధనకోసం రాష్ట్ర వ్యాపితమైన తీవ్రాందోళన చేయవలసిందిగా, కార్మిక మహాజనులందరికి విజ్ఞప్తి చేస్తోంది.

1 పని చేసిన రోజుకైనా వ్యవసాయ కార్మిక కుటుంబ కనీస అవసరాలు తీర్చడానికి అవసరమైనమొత్తాన్ని కనీస వేతనంగా వుండాలన్న ప్రాతిపదికను ఆధారం చేసుకొని రాష్ట్రమంతటా వ్యవసాయ కార్మిక కనీస వేతనంగా రోజుకు 1 8 0 నిర్ణయిస్తూ తక్షణమే కనీస వేతనాల చట్టాన్ని ప్రభుత్వం చేయాలి సమానపనికి పురుషులతోపాటు స్త్రీలకు సమాన కూలిరేటు ఏర్పర్చాలి

వేతనాలను ధాన్యరూపంలో తీసుకోవడమా లేక ధనరూపంలో తీసుకోవడమా అనేవిషయాన్ని వ్యవసాయ కార్మికుల నిర్ణయానికి వదలిపెట్టాలి

ఈ కనీసవేతనం ఊడ్పులు, కోతలు లాంటి మామూలు పనులకు మాత్రమే ఇంతకన్నా కష్టమైన పనులకు (నూర్పిళ్ళు వగైరా బరువుపనులకు) యింతకన్నా హెచ్చురేటు వుండాలి

2 ఒక ప్రాంతంలోని పాలేళ్ళ జీతాలు ఆ ప్రాంతంలోని రోజువారి కనీసవేతనానికి 365 రెట్లకు తగ్గకుండా వుండే ప్రాతిపదికపై నిర్ణయించాలి కృష్ణ, గుంటూరు, ఉభయ గోదావరి, జిల్లాల డెల్టా ప్రాంతాలలో 30 బస్తాల ధాన్యం పాలేరు జీతంగా నిర్ణయించాలి ఈవిధంగా రాష్ట్రంలోని యితర ప్రాంతాలలో పైసూత్రాన్ని ప్రాతిపదికగా తీసుకొని అచ్చటి వ్యవసాయార్థిక పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని పాలేళ్ళ జీతాలను నిర్ణయించాలి

3 పాలేళ్ళకు పనిగంటలు 8 కంటే హెచ్చు వుండరాదు

4 పండగలతో కలుపుకొని సంవత్సరానికి 30 రోజులు సెలవులు నిర్ణయించాలి

5 ప్రభుత్వం పనిలేని రోజులలో నిరుద్యోగులైన వ్యవసాయకార్మికులకు పనులు కల్పించాలి తక్కువ వడ్డీపై కరవు అప్పులు యివ్వాలి లేదా నిరుద్యోగులకు నిరుద్యోగభృతిఏర్పాటు చేయాలి

6 రాష్ట్రమంతటా ఒకే రకమైన కొలమానాన్ని ప్రవేశపెట్టాలి పిడ్చి మురకలు, తక్కువ కొలతలలో వేతనాలను కొలుచుటను శిక్షార్హం చేయాలి

7 వేతనాల కమిటీలో వ్యవసాయ కార్మిక సంఘానికి ప్రాతినిధ్యం యివ్వాలి

ఆయా ప్రాంతాలలోవున్న వ్యవసాయస్థాయి, కార్మికులలోవున్న నిరుద్యోగం, ప్రస్తుతం అమలులోవున్న కూలీరేట్లు మున్నగు ప్రత్యేక పరిస్థితులనుదృష్టిలో పెట్టుకొని తదనుగుణ్యమైన కోర్కెలు, ఎత్తుగడలు రూపొందించుకొని తక్షణ చర్యలకు పూనుకోవాలని యీ మహాసభ అధీన సంఘాలకు, సభ్యులకు కార్యకర్తలకు ఆదేశిస్తోంది

కేరళకు జేజేలు

ఈ వ్యాక మహాసభలో కేరళ ప్రభుత్వాన్ని అభినందిస్తూ తీర్మానం ఆమోదించారు అందులో ఇలావుంది

'ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మికులంతా కేరళ ప్రభుత్వానికి అండగా నిలబడాలి

మన పొరుగు రాష్ట్రమైన కేరళ రాష్ట్రంలో వ్యవసాయ కార్మికవర్గ తదితర పీడితప్రజలు తమ తమ హక్కుల కోసం దీర్ఘకాల పోరాటం సాగిస్తూ యున్నారు 1957 సంవత్సరం జనరల్ ఎన్నికలలో శాసనసభలోనికి వ్యవసాయ కార్మికుల పీడిత ప్రజల ప్రతినిధులు అనేకమంది ఎన్నుకోబడ్డారు

పర్యవసానంగా కేరళలో కమ్యూనిస్టుపార్టీ నాయకత్వాన ప్రభుత్వం ఏర్పడింది తదనంతరం కేరళప్రభుత్వం వ్యవసాయ కార్మికులకు సంబంధించిన అనేక సమస్యలను పరిష్కరించ బూనుకుంది 7 లక్షల బంజరు భూములను వ్యవసాయ కార్మికులకు, పేద రైతాంగానికి, కొల్లొనకుపంచి శాశ్వత పట్టాల నిచ్చింది

వ్యవసాయ కార్మికులకు కనీస కూలిరేటుల చట్టాన్ని తెచ్చి అమలుపర్చింది భూస్వాముల పొలాల్లో కాపురమున్న వ్యవసాయ కార్మికులను ఆ యా స్థలాలనుండి తొలగించకుండా నిషేధించింది పేదలకు ఇళ్ళస్థలాలు ఉచితంగా మంజూరు చేసింది ఉచిత లీగల్ సహాయం శాంక్షన్ చేసింది విద్యార్థులకు ఉచిత విద్యా సౌకర్యాలు, మధ్యాహ్న భోజన సదుపాయాలు ఏర్పాటుచేసింది బేదఖళ్ళను నిషేధిస్తూ కౌలుదార్లకు రక్షణ కల్పించింది లేబరు కాంట్రాక్టు సొసైటీలను విరివిగా స్థాపించి గ్రాంట్లు మంజూరుచేసి సహాయం చేస్తోంది

అభ్యుదయకర పద్ధతుల్లో భూసంస్కరణలను అమలు పరుస్తూ చట్టం చేస్తూంది

ఉపాధ్యాయుల జీవితాన్ని బాగు పర్చటానికి, విద్యావిధానాన్ని చక్కబర్చటానికి విద్యా చట్టాన్ని తెచ్చింది వ్యవసాయ కార్మికులకు పేదవర్గాలకు ప్రభుత్వం చేస్తున్న యీ సౌకర్యాలను చూచి భూస్వాములకు కన్నుకుట్టింది కాంగ్రెసు, ముస్లిమ్ లీగు, ఇతర ప్రతిపక్ష పార్టీలు, కుల, మత వర్గాలు ఏకంగా రెచ్చగొట్టి కేరళ ప్రభుత్వాన్ని పడగొట్టడానికి విశ్వప్రయత్నాలు చేస్తున్నారు

ఈ ప్రతిపక్షాల కుట్రలను ఖండిస్తూ కేరళ కమ్యూనిస్టు ప్రభుత్వానికి అండగా నిలబడాల్సిందిగా వ్యవసాయ కార్మికులకు, ఇతర ప్రజాతంత్రవాదులకు యీ మహాసభ విజ్ఞప్తి చేస్తోంది

ఈ సందర్భములో యీ మహాసభ కేరళ ప్రభుత్వానికి జేజేలు అర్పిస్తూ, కేరళ కమ్యూనిస్టు ప్రభుత్వం చిరకాలం వర్ధిల్లాలని ఆకాంక్షిస్తుంది

కేరళ కమ్యూనిస్టు ప్రభుత్వ గౌరవార్థం యీ మహాసభ ఒక్క నిముషం లేచి నిలబడి జేజేలు అర్పిస్తోంది

ఎన్ జి వోలకు అండదండలు

మరొక తీర్మానంలో ఆంధ్రప్రదేశ్ ఎన్ జి వోలు, ఉపాధ్యాయులు, నాల్గవతరగతి ఉద్యోగులు జీతాల పెంపుదలకోసం చేస్తున్న ఆందోళనను బలపర్చారు

ఆ సంఘ కార్యదర్శి శ్రీరాములు గార్ని అన్యాయంగా సస్పెండ్ చేసినారనీ, యిటువంటి అక్రమ పద్ధతిని ఉపసంహరించుకోవలెనని ప్రభుత్వాన్ని కోరారు

ముంద్రా కుంభకోణంలో పటేల్ కుపాత్రలేదట!

భారతప్రభుత్వం నిర్ణయించబోతున్నట్లు వార్తలు

న్యూఢిల్లీ, మే 26

ముంద్రా కుంభకోణంలో పాత్ర గల కేంద్ర ఆర్థికమంత్రిత్వశాఖ మాజీ ప్రధాన కార్యదర్శి శ్రీ హెచ్ యమ్ పటేల్‌పై వచ్చిన ఆరోపణలను ఉపసంహరించుకోవడానికి భారత ప్రభుత్వం నిశ్చయించినట్లు తెలుస్తోంది

జీవితభీమా కార్పొరేషన్ అధ్యక్షుడుగావున్న శ్రీ కామత్‌నుమాత్రం యూనియన్ పబ్లిక్ సర్వీసు కమిషన్ సలహా ననుసరించి అభిశంసించడానికి నిర్ణయించినట్లు తెలుస్తోంది

మాజీ ఆర్థిక మంత్రి శ్రీ కృష్ణమాచారికి జీవితభీమా కార్పొరేషన్ వాటాలను ముంద్రాకు అమ్మడంలో ఎలాంటి సంబంధంలేదనీ, అయితే రాజ్యాంగరీత్యా ఈ వ్యవహారంలో ఆయనకుగల సంబంధాన్నిబట్టి ఆయన తనపదవికిరాజీనామా యిచ్చారని భారత ప్రభుత్వం అభిప్రాయపడినట్లు తెలుస్తోంది

ముంద్రా కుంభకోణంపై న్యాయమూర్తి చాగ్లా కమిషన్ నివేదికను ఆమోదించిన తరువాత ప్రభుత్వం అందులో ముఖ్యపాత్రను నిర్వహించారని చెప్పబడుతున్న అధికారులను విచారించేందుకు సుప్రీంకోర్టు న్యాయమూర్తి శ్రీవివియన్ బోసు నాయకత్వాన ఒక ఉన్నతాధికార సంఘాన్ని నియమించింది ఆ సంఘంలో మాజీ ఎన్నికల కమీషనర్ శ్రీసుకుమార్ సేన్, మద్రాసు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శ్రీ కల్యాణసుందరం గార్లను సభ్యులుగా నియమించింది

బోసు కమిషన్ నివేదికను పరిశీలించిన తరువాత ప్రభుత్వం వారి తమ అధికారాన్ని దుర్వినియోగపరచినట్లు కొన్ని ఆరోపణలు చేశారు వారిని ఉద్యోగాన్నుండి తొలగించి, వారి విషయమై ఏమి చేయాలో సలహా యివ్వవలసిందిగా యూనియన్ పబ్లిక్ సర్వీసు కమిషన్‌ను కోరింది

తనముందున్న సమాచారాన్ని పరిశీలించిన యూనియన్ పబ్లిక్ సర్వీసు కమిషన్ శ్రీ పటేల్‌పై వచ్చిన ఆరోపణలు రుజువు కాలేదనీ, వాటాల ధరల నిర్ణయంలో బాధ్యత అంతా కార్పొరేషన్ అధ్యక్షుడైన శ్రీ కామత్‌దేనని నిర్ణయించారు

ఈ విషయమై ప్రభుత్వం ఒక నిర్ణయానికి వచ్చేముందు పబ్లిక్ సర్వీసు కమిషన్ చేసిన కొన్ని వాదనలను అంగీకరించలేదని తెలుస్తోంది

యూనియన్ పబ్లిక్ సర్వీసు కమిషన్ నిర్ణయంకూడ ఏకగ్రీవంగా జరగలేదట ఇద్దరిని తప్పనిసరిగా రిటైర్ కావలసిందిగా ప్రభుత్వం వారికి సలహా యివ్వాలని కోరుతూ కమిషన్‌లో ఒక భిన్నాభిప్రాయాన్ని వ్రాశారట

ఈ వ్యవహారంలో జరిగిన నిజమంతా బయట పడలేదని బోసు కమిటీ నివేదికలోని అంశంతో కూడా ప్రభుత్వం ఏకీభవించడం లేదట

ఎక్స్‌ప్రెస్ పత్రికల సిబ్బంది కోర్కెలు

ఆంధ్ర ముఖ్యమంత్రి వాగ్దానం

మద్రాసు, మే 26

మద్రాసులోని ఎక్స్‌ప్రెస్ గ్రూపు పత్రికలను మూసివేసిన ఫలితంగా ఏర్పడిన క్లిష్టపరిస్థితిని పరిష్కరించేందుకు సానుభూతితో ప్రయత్నిస్తానని ఆంధ్ర ముఖ్యమంత్రి శ్రీ నీలం సంజీవరెడ్డిగారు తనను కలుసుకొన్న మద్రాసు పాత్రికేయులసంఘ ప్రతినిధివర్గం వారికి వాగ్దానం చేశారు

ఈ సమస్య ఆంధ్ర, మద్రాసు - రెండు రాష్ట్రాలకూ సంబంధించినది కాబట్టి మద్రాసు ముఖ్యమంత్రిని కలుసుకొని తాను చర్చించుతానని ఆయన చెప్పారు

మద్రాసు పాత్రికేయుల సంఘ ప్రతినిధివర్గ సభ్యులు శ్రీ సంజీవరెడ్డి గారిని ఇటీవల మదనపల్లిలో కలుసుకొని మాట్లాడారు

మద్రాసు పాత్రికేయుల సంఘంవారు కేంద్ర వాణిజ్య మంత్రి శ్రీ లాల్ బహదూర్ శాస్త్రికి ఒక మెమొరాండమ్ సమర్పించారు మద్రాసులోని ఎక్స్‌ప్రెస్ పత్రికలకోసం యివ్వబడిన న్యూస్‌ప్రింట్ లైసెన్సు రద్దు చేయాలని ఆ మెమొరాండంలో వారు కోరారు

హైకోర్టు ఉత్తర్వుకు విరుద్ధంగా ఎక్స్‌ప్రెస్ ఎస్టేట్స్ ఆవరణ నుండి న్యూస్‌ప్రింటును తరలించడానికి గోయంకా చేస్తున్న ప్రయత్నాలను అడ్డుకొనేందుకు సత్యాగ్రహాన్ని ప్రారంభించాలనికూడా పాత్రికేయుల కార్యాచరణ సమితి ఆలోచించుతోంది ఈ విషయమై రాష్ట్ర ప్రభుత్వానికి కార్యాచరణ సమితివారు ఒక నోటీసునుకూడా పంపారు

గోయంకాకు, ఎక్స్‌ప్రెస్ పత్రికల సిబ్బందికీ మధ్యవున్న వివాదాన్ని పరిష్కరించేందుకు మాజీ ఆర్థిక మంత్రి శ్రీ టి టి కృష్ణమాచారి మధ్యవర్తిగా యింకా ప్రయత్నం చేస్తూనే వున్నారు కాని యింతవరకూ ఆ ప్రయత్నాలు ముందుకు సాగినట్లు లేదని తెలుస్తోంది. (వి వి.)

మంత్రివద్దకు శ్రీ కె యల్ నరసింహం రాయబారం

హైదరాబాద్, మే 26

సీతాకరం. పి. డబ్ల్యు డి కార్యాలయాలో జరుగుతున్నాన్న సమ్మె విషయం గురించి, శ్రీ కె యల్ నరసింహం (యం. పి.) కార్మిక మంత్రినీ, పి డబ్ల్యు డి కార్యదర్శినీ, లేబరు కమీషనరును కలుసుకున్నారు జూన్ 1 వరకూ ఇద్దరి గనుమంత్రి హైదరాబాదు రారనీ, అంతవరకూ తామేమీ చేయగలిగేది లేదనీ చెప్పారన్నట్లు తెలుస్తోంది (వి వి)

యూనివర్శిటీల్లో బోధనాభాషలు

ఏనాటికైనా ప్రాంతీయ భాషలే ఉండాలని శ్రీ సి డి దేశముఖ్

న్యూఢిల్లీ, మే 26

ఇప్పుడు కాకపోయినా కొంత కాలానికైనా ప్రాంతీయభాషలే యూనివర్శిటీలలో బోధనాభాషలుగా వుండవలసివస్తుందని యూనివర్శిటీ గ్రాంట్సు కమిషన్ అధ్యక్షులు శ్రీ సి డి దేశముఖ్ ఇక్కడ పత్రికా గోష్టిలో మాట్లాడుతూ అభిప్రాయాన్ని వెలిబుచ్చారు

అయితే ఏదో ఒకటి ఉమ్మడి భాషగా వుండకపోయిన పక్షంలో ఒక విశ్వవిద్యాలయాన్నుండి మరొక విశ్వవిద్యాలయానికి విద్యార్థులు మారడానికీ, ప్రొఫెసర్లు మారడానికీ అవకాశం వుండదన్నారు కాబట్టి వచ్చే పదేండ్ల వరకైనా అలాంటి ఉమ్మడి భాషగా హిందీకంటే ఇంగ్లీషే హెచ్చుగా ఉపయోగపడగలదని ఆయనన్నారు

రేడియో

శుక్రవారం, మే 29

విజయవాడ

ఉదయం 6-30 శుభోదయం, 6 35 వాద్యసంగీతం, 6-40 భక్తిరంజని 7-0 తె వా, 7-15 శేఠి శ్రీరామశర్మ 7-45 గాంధీ చర్చ 8 0 ఆం వా 8 15 హిం వా, మధ్యాహ్నం 12-30 సుస్వర శివరాం, 1-0 కార్మికులకు 1 30 భజనలు, 1-50 తె వా, సాయంత్రము 6-0 స్థానిక ప్రకటనలు, 6-5 ప్రాంతీయ వార్తలు, 6-15 గ్రామస్థులకు, 7-0 తె వా 7-15 గ్రామస్థులకు, 7-30 వి ద్వారిస్వామి అయ్యంగార్ : వీణ, 9 0 ఆం వా 9 15 గులాబీ అత్తరు (నాటిక) రచన వింజమూరి శివరామారావు 9-30 లలిత సంగీతం, 9-50 సుస్వర శివరాం, 10 30 సమాప్తి

హైదరాబాద్-బి

